## నేటి నుంచి అయ్యప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు



కామారెడ్డి, డిసెంబర్ 28 : కామారెడ్డి పట్టణంలోని అయ్యప్ప దేవాలయంలో ఈ నెల 29 నుంచి 31వ తేదీ వరకు మండల పూజ, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. కేరళ సహాయ అర్చకులు ఉన్ని కృష్ణన్ నంబూద్రి,ఆలయ అర్చకులు మిత్ శాస్త్రి (కన్నయ్య), పలువురు రుత్వికులు, వేదపండితుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు కొనసాగనున్నాయి.

## కోల్‌కతా ర్యాలీలో జిల్లా టీఎన్జీవోస్ ప్రతినిధులు

కామారెడ్డి, డిసెంబర్ 28 : అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య కౌన్సిల్ సమావేశాలు కోల్‌కతాలో కొనసాగుతున్నాయి. ఇందులోభాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ఉద్యోగ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రతినిధులతో గురువారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో కామారెడ్డి టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు వెంకట్ రెడ్డి, కార్యదర్శి సాయిలు, కేంద్ర సంఘ కార్యదర్శి నాగరాజు,జిల్లా సహఅధ్యక్షుడు చక్రధర్, కోశాధికారి దేవరాజు, ఉపాధ్యక్షుడు సాయిలు, ఎల్లారెడ్డి తాలూకా అధ్యక్షుడు మహిపాల్ పాల్గొన్నారు.

# ‘ప్రజాపాలన’కు వెల్లువెత్తిన దరఖాస్తులు

నమస్తే తెలంగాణ యంత్రాంగం, డిసెంబర్ 28 : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న ఆరు గ్యారంటీ పథకాల కోసం ఏర్పాటు చేసిన ‘ప్రజా పాలన’కు దరఖాస్తులు వెల్లువెత్తాయి. ప్రజా పాలన కార్యక్రమం గురువారం జిల్లా వ్యాప్తంగా అట్టహాసంగా ప్రారంభించారు. కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కార్యక్రమానికి కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ హాజరయ్యారు. జిల్లాలోని మున్సిపాలిటీలు, మండలాలు, గ్రామాల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కౌంటర్ల ద్వారా ప్రజల నుంచి అధికారులు దరఖాస్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



దేవునిపల్లిలో దరఖాస్తులను పరిశీలిస్తున్న కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

**ఇబ్బంది లేకుండా దరఖాస్తులు స్వీకరించాలి : కలెక్టర్ జితేశ్ వీ పాటిల్**

ప్రజలకు ఇబ్బందులు లేకుండా దరఖాస్తులను స్వీకరించాలని కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ అధికారులకు సూచించారు. గాంధారి, సదాశివనగర్, అడ్లూర్ ఎల్లారెడ్డి, బాన్సువాడలో ప్రజా పాలన దరఖాస్తుల స్వీకరణను ఆయన పరిశీలించారు. ప్రతి ఒక్కరికీ దరఖాస్తు ఫారాలు అందేలా చూడాలని సూచించారు. ప్రజలు పెద్ద సంఖ్యలో వస్తే.. కౌంటర్లను పెంచాలన్నారు. ప్రజల నుంచి స్పందన బాగున్నదని అన్నారు. ప్రజలకు చేరువగా పాలనను అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా ఏర్పాట్లు పూర్తి చేశామని చెప్పారు. జనవరి 6 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. జిల్లాలోని 526 జీపీలు, మూడు మున్సిపాలిటీల్లోని 80 వార్డుల్లో 2,93,635 కుటుంబాలున్నాయని తెలిపారు. అన్ని పథకాలకు కుటుంబం నుంచి ఒకే దరఖాస్తు ఇస్తే సరిపోతుందని అన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి రసీదు తప్పక అందజేయాలని అధికారులకు కలెక్టర్ సూచించారు.

**ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి: ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు**

పిట్లం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన అభయహస్తం ప్రజా పాలన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు హాజరయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రారంభించిన ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జనవరి 6వ తేదీ వరకు దరఖాస్తు చేసుకొనే అవకాశం ఉన్నదని, ప్రజలు ఆందోళన చెందవద్దన్నారు.



బోర్లంలో దరఖాస్తులను స్వీకరిస్తున్న ఎంపీపీ



రాజంపేట్‌లో..



గాంధారిలో..

## కబడ్డీ పోటీలకు రావాలని ఎమ్మెల్యేకు ఆహ్వానం



పోచారం శ్రీనివాసరెడ్డిని సన్మానిస్తున్న ఎస్‌జీఎఫ్ ప్రతినిధులు

బాన్సువాడ/బాన్సువాడ టౌన్, డిసెంబర్ 28: కామారెడ్డి జిల్లా కేంద్రంలో వచ్చే నెల 7 నుంచి 11 వరకు భారత పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో 31వ జాతీయస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో పోటీలకు హాజరుకావాలని కోరుతూ ఎస్‌జీఎఫ్, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు గురువారం బాన్సువాడలో ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డిని కలిసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కుషాల్, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి రసూల్, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా కార్యదర్శి సంతోష్, బాన్సువాడ మండల కార్యదర్శి నర్వ శ్రీనివాస్, మంద ప్రవీణ్, రాష్ట్ర బాధ్యులు లక్క నరహరి, వెంకాగౌడ్, రామకృష్ణ, మండల బాధ్యులు రవీందర్, శ్రీనివాస్, పీఈటీలు అనిల్, సురేందర్, సాయిలు, రషీద్ ఉన్నారు.

## సానిటరీ, హైజిన్ కిట్స్ పంపిణీ

మాచారెడ్డి, డిసెంబర్ 28 : మండలంలోని పాల్వంచ జడ్పీహెచ్‌ఎస్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ వివేకానంద కామారెడ్డి, కెన్యూ ఆధ్వర్యంలో 200 మంది విద్యార్థినులకు సానిటరీ ప్యాడ్స్, హైజిన్ కిట్స్‌ను లయన్స్ క్లబ్ అధ్యక్షుడు చీకోటి అశోక్, ప్రోగ్రాం చైర్మన్ బంధం ప్రవీణ్‌కుమార్ గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు గోవర్ధన్, ఎంపీటీసీ కూచని లావణ్య, ఉప సర్పంచ్ జితేందర్‌రెడ్డి, డాక్టర్ విజయలక్ష్మి, ప్రతినిధులు సురేశ్, జాన్సన్, రామానంద్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక




జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

కామారెడ్డి,డిసెంబర్ 28 : జిల్లా కేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో కామారెడ్డి అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం నేషనల్ ఇంటర్ డిస్ట్రిక్ట్ జూనియర్ అథ్లెటిక్స్ సెలక్షన్స్ నిర్వహించారు. ఈ పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి 300 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ప్రతిభకనబర్చిన వారిని జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులు వచ్చే ఫిబ్రవరిలో గుజరాత్‌లో నిర్వహించనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారు. కార్యక్రమంలో రాష్ట్ర పరిశీలకుడు రాజాగౌడ్, అసోసియేషన్ అధ్యక్షుడు జైపాల్ రెడ్డి, కార్యదర్శి అనిల్ కుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## హరితహారానికి మొక్కలు సిద్ధం

బాన్సువాడ రూరల్, డిసెంబర్ 28: మండలంలోని బోర్లం క్యాంపుతండాలోని నర్సరీలో ఉపాధిహామీ కూలీలు గురువారం బ్యాగ్ ఫిల్లింగ్ పనులను పూర్తిచేశారు. నర్సరీలో పూలు, పండ్లు, నీడనిచ్చే మొక్కలను పెంచుతున్నట్లు పంచాయతీ కార్యదర్శి పరిపూర్ణ తెలిపారు.

# ఏబీవీపీ ఆధ్వర్యంలో ధర్నా



బాన్సువాడలో ధర్నా నిర్వహిస్తున్న ఏబీవీపీ నాయకులు

బాన్సువాడ టౌన్, డిసెంబర్ 28: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ కృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏబీవీపీ ఆధ్వర్యంలో బాన్సువాడ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పరిషత్ నాయకులు మాట్లాడుతూ.. విద్యాశాఖ జారీ చేసే నియమ, నిబంధనలను ప్రభుత్వ పాఠశాలల్లో పాటించడంలేదన్నారు. ఉపాధ్యాయ సిబ్బంది సరిపడా లేక విద్యార్థులకు తరగతులు కొనసాగడంలేదన్నారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో ఏబీవీపీ ప్రతినిధులు శ్రీకాంత్, అనుతేజ, జస్వంత్, ఆనంద్, అరవింద్, నాగేశ్, సిద్ధు, అభితేజ్, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా అయ్యప్ప మహా పడిపూజ

బాన్సువాడ టౌన్, డిసెంబర్ 28: బాన్సువాడ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో బుధవారం రాత్రి అయ్యప్పమాలధారులు మహా మండల పడిపూజ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. బాన్సువాడ అయ్యప్ప ఆలయంలో అయ్యప్ప సేవాసమితి ఆధ్వర్యంలో నిత్యాన్నదానం కోసం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయగా.. ఇందుకు సంబంధించిన కరపత్రాలను వేదికపై ఆవిష్కరించారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి తదితరులు

# వైభవంగా అయోధ్య అక్షింతల ఊరేగింపు



మద్నూర్‌లో అయోధ్య శ్రీరామ పూజిత అక్షింతలను ఊరేగిస్తున్న భక్తులు



పిట్లంలో..

పిట్లం, డిసెంబర్ 28: అయోధ్య శ్రీరామ పూజిత అక్షింతలకు పిట్లంలో భక్తులు వైభవంగా ఊరేగింపు నిర్వహించారు. స్థానిక అయ్యప్ప ఆలయం నుంచి భాజాభజంత్రీల మధ్య ప్రధాన వీధుల మీదుగా ఊరేగింపుగా తీసుకెళ్లి శ్రీరామ ఆలయంలో అందజేశారు. కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్, రాముని భక్తులు, మహిళలు, అయ్యప్ప మాల ధారులు పాల్గొన్నారు.

**మద్నూర్‌లో..**

మద్నూర్, డిసెంబర్ 28: మద్నూర్‌లో అయోధ్య రామాలయ పూజిత అక్షింతల శోభాయాత్రనను బారడిపోచమ్మ ఆలయం నుంచి గాంధీ చౌక్ మీదుగా ఆర్యసమాజ్ వరకు నిర్వహించారు. శోభాయాత్రలో భాజభజంత్రీలు, వార్కారీల కీర్తనలు అలరించాయి.

# ప్రజాపాలనలో అధికారుల నిర్లక్ష్యం

నిజాంసాగర్, డిసెంబర్ 28: నిజాంసాగర్ మండల కేంద్రంలో గురువారం ఉదయం ప్రజా పాలన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రజల నుంచి ఆరు గ్యారంటీల దరఖాస్తుల స్వీకరణ కోసం ఆరు కౌంటర్లను ఏర్పాటు చేశారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం 12వరకు దరఖాస్తుల స్వీకరణ చేపట్టారు. మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు కార్యక్రమాన్ని కొనసాగించాల్సి ఉండగా.. మధ్యాహ్నం భోజనం కోసం వెళ్లిన అధికారుల్లో కొంతమంది 3:30 గంటలు దాటినప్పటికీ కౌంటర్ వద్దకు చేరుకోలేదు. దీంతో ప్రజలు వారి కోసం వేచి చూస్తూ అక్కడే కూర్చున్నారు. దీంతో పాటు సాయంత్రం ఆరు గంటల వరకు కొనసాగించాల్సిన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని ఐదు గంటలకే ముగించారు. దీంతో ఐదు గంటల అనంతరం వచ్చిన పలువురు వెనుదిరిగిపోయారు.



నిజాంసాగర్‌లో ఖాళీగా దర్శనమిస్తున్న కౌంటర్

## పారిశుద్ధ్య కార్మికులకు వంట సామగ్రి పంపిణీ

బిచ్కుంద, డిసెంబర్ 28: మండలంలోని దౌల్తాపూర్, గోపన్‌పల్లి గ్రామాల్లో పరిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు గురువారం వంట సామగ్రిని పంపిణీ చేశారు. రెడ్‌క్రాస్ సొసైటీ సౌజన్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులకు పారిశుద్ధ్య కార్మికులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ మండల చైర్మన్ కోలావార్ కుమార్, జిల్లా కోశాధికారి దస్తీరాం, వైస్ చైర్మన్ రచ్చ శివకాంత్, ఓం ప్రకాశ్, విశ్వనాథ్, గోపన్‌పల్లి సర్పంచ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



వంట సామగ్రిని పంపిణీ చేస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ బాధ్యులు

## వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి



విద్యార్థినులకు శానిటరీ ప్యాడ్లను పంపిణీ చేస్తున్న డాక్టర్ విజయలక్ష్మి

రామారెడ్డి, డిసెంబర్ 28: రామారెడ్డి బాలికల పాఠశాల విద్యార్థినులకు లయన్స్ క్లబ్, వివేకానంద వారి సమన్వయంలో శానిటరీ ప్యాడ్లను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడారు. స్త్రీలకు వచ్చే వ్యాధులు, వ్యక్తిగత పరిశుభ్రత గురించి విద్యార్థినులకు వివరించారు. 200 మంది విద్యార్థినులకు ప్యాడ్లను పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సంజీవ్, ఎస్ఎంసీ చైర్మన్ ఉసికె రాజేందర్, క్లబ్ అధ్యక్షుడు చీకోటి అశోక్, కార్యదర్శి మురళి, కోశాధికారి సురేశ్, ప్రోగ్రాం ఇన్‌చార్జి బందం ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ వ్యవస్థాపక దినోత్సవం

కామారెడ్డి రూరల్/ పిట్లం/ ఎల్లారెడ్డి రూరల్, అక్టోబర్ 28: గురువారం కాంగ్రెస్ పార్టీ 139వ వ్యవస్థాపక దినోత్సవాన్ని గురువారం ఆయా గ్రామాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. కామారెడ్డి మండలం గర్గుల్ గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు పిప్పరి లింబాద్రి, నాయకులు బోంబోతుల కుమార్ గౌడ్, కొట్టూరి జగదీశ్వర్, కార్యకర్తలు పాల్గొన్నారు. పిట్లంలోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు బొడ్ల రాజు, గంగారాం, శివకుమార్, అఫ్రోజ్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు. ఎల్లారెడ్డి పట్టణంలోని పార్టీ కార్యాలయంలో జెండాను ఎగురవేశారు.

## రైల్వే ఎస్‌హెచ్‌వోగా సాయిరెడ్డి

నిజామాబాద్ క్రైం, డిసెంబర్ 28 : నిజామాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వోగా హెచ్.సాయిరెడ్డి గురువారం బాధ్యతలను స్వీకరించారు. కామారెడ్డి జిల్లా భిక్కనూర్ సర్కిల్ పరిధిలోని బీబీపేట్ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వోగా విధులు నిర్వర్తిస్తున్న సాయిరెడ్డిని ఉన్నతాధికారులు నిజామాబాద్ రైల్వేకు బదిలీ చేశారు. ఇప్పటివరకు ఇక్కడ ఎస్సైగా కొనసాగిన తాహునాయక్ బదిలీ కావడంతో ఆయన స్థానంలో ఎస్‌హెచ్‌వోగా సాయిరెడ్డి చార్జ్ తీసుకున్నారు. రైల్వేపోలీస్ సిబ్బంది ఎస్‌హెచ్‌వోకు శుభాకాంక్షలు తెలిపారు.

NAMASTHE TELANGANA CLASSIFIEDS
నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

CHANGE OF NAME
★I, CHAKALI CHINNA LIMBANNA R/o H.No: 3-19, Issapally ,Armoor(M),Nzb (D),Now Changed My SurName/Name As BANDI CHINNA LIMBANNA
NTZ-318865

CHANGE OF NAME
★I, KADEM SRIKANTH, S/o. Kadem Rajeshwar, R/o. Kisan Nagar, Balkonda, Nizamabad District, TS. Changed My Name as KADHAM SRIKANTH, S/o. Kadham Rajeshwar.
NT-324498

CHANGE OF NAME
★I, PARVAI PRAMEELA, R/o. 5-67/1, Village: Nallavelly, Mandal: Indalwai, Dist.: Nizamabad, TS. Henceforth shall be Known as SAMBARI PRAMEELA, W/o. Sambari Mohan.
NT-324498

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే,
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
"పేరు మార్పిడి" ప్రకటన
4 లైన్లకు 250/-
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
GST వర్తించును
సెల్ : 91827 77590

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

## జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

పెద్ద కొడప్‌గల్, డిసెంబర్ 28: మండలంలోని వడ్లం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని సౌజన్య జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ ధర్మేందర్ గురువారం తెలిపారు. సౌజన్య ఇటీవల జరిగిన 19వ ఇంటర్ డిస్ట్రిక్ట్ జూనియర్ అథ్లెటిక్స్ మీట్ 2023–24లో ట్రయాథ్లాన్ 60 మీటర్ల పరుగు, లాంగ్ జంప్, హై జంప్, కిడ్స్ జావెలిన్‌త్రోలో ప్రథమ బహుమతి సాధించిందని పేర్కొన్నారు. దీంతో ఆమెను నిర్వాహకులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. గుజరాత్ రాష్ట్రంలో ఫిబ్రవరి 16 నుంచి 18 వరకు నిర్వహించే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నదని పీఈటీ వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థినిని ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు.



మెడల్‌తో సౌజన్య

# పంటలకు సేంద్రియ ఎరువులను వేయాలి

పెద్ద కొడప్‌డల్, డిసెంబర్ 28: రైతులు సేంద్రియ ఎరువులను వినియోగించి భూసారాన్ని కాపాడుకోవాలని రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధి ముకుందర్ అన్నారు. మండలంలోని కాటేపల్లిలో ‘వ్యవసాయ పర్యావరణ అనుకూల వ్యవసాయ పద్ధతులు – సాంకేతికత’పై రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రైతులకు గురువారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముకుందర్ మాట్లాడుతూ.. జీవ సంబంధిత ఎరువులైన పీఎస్‌బీ, నానో యూరియా, నానో డీఏపీ, వేస్ట్ డీకంపోసర్ వాడితే వాతావరణ కాలుష్యం జరుకుండా, పంటల అధిక దిగుబడి సాధ్యమని అన్నారు. రైతులు భూసార పరీక్షలు నిర్వహించుకొని, ఫలితాల ఆధారంగా పంటలను సాగుచేస్తూ.. ఎరువులను వాడాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ విఠల్, ఎంపీటీసీ సాయిలు, ఏఈవో రూప తదితరులు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధి

## క్యాలెండర్ ఆవిష్కరణ

పిట్లం, డిసెంబర్ 28: తెలంగాణ రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయీస్ యూనియన్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను పిట్లంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు గురువారం ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. యూనియన్ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని అన్నారు. బన్సీలాల్, సంతోష్ రెడ్డి, దయానంద్, గణేశ్‌రావు, మాణిక్‌రావు, హర్జ్యా, నారాయణ, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు



హోమం నిర్వహిస్తున్న భక్తులు

## వైభవంగా ఆలయ వార్షికోత్సవం

నిజాంసాగర్, డిసెంబర్ 28: నిజాంసాగర్ మండల కేంద్రంలోని పోచమ్మ, మైసమ్మ ఆలయ వార్షికోత్సవాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ వేద పండితుడు సంజీవ్‌రావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. అనంతరం ఒడి బియ్యం, అన్నదాన కార్యక్రమాలను చేపట్టారు. సాయంత్రం బోనాల ఊరేగింపును ఘనంగా నిర్వహించారు.